క్లుప్తంగా

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సంగెం : మండల కేంద్రంలోని రవిచంద్ర హైస్కూల్‌లో 2012–13 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆ పాఠశాలలో ఆదివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కాసం చంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పులి రాజు, మెట్టుపల్లి మల్లయ్య, తేరాల విష్ణువర్ధన్, నాగపురి వీరస్వామిలను శాలువాలతో సన్మానించారు. పదో తరగతి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడి చేశారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని క్రిష్టాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కునుసోతు మూన్యానాయక్ ఇటీవల ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన చినగారి రాజు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడితో కలిసి స్థానిక హైస్కూల్‌లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు ఆదివారం రూ.40 వేల సాయం అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాజు స్నేహితులు వీరగోని దేవేందర్, పేర్ల శ్రవణ్, ఆకుల రుద్రప్రసాద్, తాటికొండ శివకుమార్, కందుకూరి కిరణ్, కంబాల సాంబరాజు, కోట రాజు, మేకల ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి..



చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ దుడ్డె శోభన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రూ.30 వేల సాయం అందజేశారు. తొలుత శోభన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు గుర్రపు భిక్షపతి, ఉపాధ్యక్షుడు వైనాల రాజేశ్, గౌరవ అధ్యక్షులు బండారి సత్యం, నాంపల్లి సంపత్, ముదురుకుల భిక్షపతి, బాషా, సుంకరి రాంప్రసాద్, జంగిలి సదయ్య, కందిక శేఖర్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎదురబోయిన వీరమల్లు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల సాయం అందజేశారు.

ఎంజీఎం మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రామన్నపేట: ఎంజీఎం ఆస్పత్రితో చికిత్స పొందుతూ మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మార్చురీలో భద్రపర్చినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. కాలికి గాయమై చికిత్స కోసం ఈనెల 7న ఆస్పత్రికి వచ్చిన సదురు వ్యక్తి చికిత్స పొందుతూ 21న మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. వివరాలకు 87126 85117, 87126 85090, 87126 85005 నంబర్లలో లేదా మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ సూచించారు.

బాధిత వ్యక్తికి ఎమ్మెల్యే పరామర్శ

మడికొండ : కిడ్నీ సంబంధిత సమస్యతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్ తల్లి లక్ష్మిని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట ఎల్‌ఐసీ డివిజనల్ యూనియన్ జనరల్ సెక్రటరీ మర్రి ప్రభాకర్, రఘుచందర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి

రాయపర్తి (వర్ధన్నపేట) : వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలో అర్హులు నిర్భయంగా ఓటు వేయాలని వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య కోరారు. వర్ధన్నపేటలోని పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించి మాట్లాడారు. నేడు (27న) 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు నిర్వహించాలని ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏసీపీ వెంట ఎస్సై ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.



వర్ధన్నపేట : సిబ్బందితో మాట్లాడుతున్న నర్సయ్య



పర్వతగిరి : పోలీసులతో మాట్లాడుతున్న డీసీపీ

పర్వతగిరి : మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 138, 139వ పోలింగ్ స్టేషన్లను ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై జి.వెంకన్న, పోలీసులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎస్సై మహేందర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని పోలింగ్ కేంద్రాలను అడిషనల్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఫణికుమార్ సందర్శించి పరిశీలించారు. మండల కేంద్రంలోని జెడ్పీ స్కూల్‌లో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయగా 1697 మంది పట్టభద్రుల ఓటర్లు ఓటు వేయనున్నారని చెప్పారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్సై అరుణ్ తెలిపారు.

ఖానాపురం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను తహసీల్దార్ కిరణ్‌కుమార్ సందర్శించారు. పోలింగ్ అధికారులకు తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ భారతి, ఎస్సై రఘుపతి సూచనలు అందించారు.

సంగెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాజ్‌కుమార్ సందర్శించి పరిశీలించారు. పోలింగ్‌లో 12 మంది సిబ్బంది, ఆరుగురు పోలీసులు, మొబైల్ బృందాలు ఎన్నికల విధుల్లో పాల్గొంటాయని చెప్పారు.

దుగ్గొండి : మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. మండల పరిధిలో 2 వేల 242 మంది ఓటు వేయనున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు.

గీసుకొండ : మండల కేంద్రంలో అధికారులు నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 2 వేల 965 మంది ఓటు వినియోగించుకోనున్నారు.

నల్లబెల్లి : మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాజేశ్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ నర్సింహామూర్తి పర్యవేక్షించారు. ఎన్నికల నిర్వహణకు సహకరించాలని ఎస్సై రామారావు కోరారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం



క్రీడాకారులతో క్రీడల అధికారి సత్యవాణి, కోచ్, తదితరులు

● జిల్లా యువజన, క్రీడల అధికారి సత్యవాణి

ఖానాపురం : క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని జిల్లా యువజన, క్రీడల అధికారి సత్యవాణి తెలిపారు. మండలంలోని అశోక్‌నగర్, అయోధ్యనగర్‌ల్లో ఏర్పాటు చేసిన క్రీడల శిబిరాలను ఆదివారం ఆమె సందర్శించి మాట్లాడారు. అశోక్‌నగర్‌లో అథ్లెటిక్స్, అయోధ్యనగర్‌లో వాలీబాల్ క్రీడల శిబిరాలతో యువతకు మెరుగైన శిక్షణ లభిస్తుందని చెప్పారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. పట్టుదలతో క్రీడల్లో రాణించాలని సూచించారు. చదువుతోపాటు క్రీడలకు సమయం కేటాయించాలని చెప్పారు. యువత శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి బాటలు వేస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడల్లో శిక్షణ పొందిన యువతకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కబడ్డీ కోచ్ యాట రవికుమార్, ఉరుసుల శేఖర్, వజ్జ రాజేశ్, పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి గుంతలమయం

సంగెం : అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వరంగల్–విజయవాడ మార్గంలో థర్డ్ లైన్ పూర్తి కావడంతో రైళ్ల రాకపోకలకు లెవల్ క్రాసింగ్ గేట్లు అడ్డంకిగా ఉండకుండా రైల్వే శాఖ లెవల్ క్రాసింగ్ గేట్లను తొలగించేందుకు ఆర్‌యూబీలను నిర్మించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మండలంలోని ఎల్గూర్ రంగంపేట వద్ద ఉన్న 68/ఇ రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్‌ను గత మార్చి 22న పూర్తిగా తొలగించారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించి హడావుడిగా ప్రారంభించారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా బ్రిడ్జి నిర్మించడంతో అడుగడుగునా గుంతలు తేలి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చిరు జల్లులు కురిసినా బ్రిడ్జి కింద నీరు నిలిచి గుంతలు కనపడక పలువురు వాహనదారులు కింద పడిపోయి ఆసుపత్రి పాలైన ఘటనలూ ఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేసి సీసీ రోడ్డు నిర్మించి ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన ఆర్‌యూబీ

రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సదానందం

నర్సంపేట : ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి అన్ని రకాల పంటల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ ఉత్పత్తి సాధనాలు ఉచితంగా అందించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గడ్డం సదానందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి అడ్డూరి రాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో సదానందం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2024లోనే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి రెండింతల ఆదాయం తెచ్చి పెడతామని నమ్మించి రైతులను వంచించిందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నాశనం చేసేలా సబ్సిడీలు రద్దు చేసిందని చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డాక రైతుబంధు పథకాన్ని సర్వరోగ నివారిణిలా చూపించి రైతులను మోసం చేశారన్నారు. బ్యాంకుల్లో అప్పు తీసుకున్న రైతులకు మాత్రమే పంటల బీమా పథకాన్ని వర్తింపజేయాలని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల పరిహారం ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి చిర్ర సూరి, జిల్లా కమిటీ సభ్యులు మైదం పాణి, లాల్, మనోహచారి, రాజేందర్, శ్రీనివాస్, శ్రావణ్, మురళి, గోపి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలి



ఖానాపురం : మండలంలోని బుధరావుపేట గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 27, 28 తేదీల్లో తలపెట్టిన బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని ఆలయ కమిటీ బాధ్యులు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, చెడిపాక ఉపేందర్, పగడాల రాంనర్సయ్య కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేను ఆదివారం కలిసి కరపత్రాలను అందజేసి మాట్లాడారు. రెండ్రోజులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లాల్ సాహెబ్, లింగయ్య, వెంకటేశ్వర్లు, చాంద్‌పాషా పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం.. ఇద్దరిపై కేసు

సంగెం : గుడుంబా తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వర్ధన్నపేట ఎక్సైజ్ ఎస్సై సరిత తెలిపారు. పర్వతగిరి మండలంలోని బక్కతండాకు చెందిన లావుడ్య సునీత, గుగులోత్ చందులాల్ 10 లీటర్ల గుడుంబాను ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా సంగెం మండలంలోని తిమ్మాపూర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని కుంటపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న చిర్ర రజిత నుంచి 3 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులతో రామస్వామి, తదితరులు

సంగెం : మండల కేంద్రంలో మార్గం స్వచ్ఛంద సేవా సోసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిబిరంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ప్రముఖ వ్యాపార వేత్త గోక కుమారస్వామి ఆదివారం రూ 25 వేల విలువైన స్టడీ మెటీరియల్, ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యాదానం గొప్పదని చెప్పారు. చదువుతోనే విద్యార్థులు భావి జీవితంలో ఉన్నత స్థానానికి చేరగలరని చెప్పారు. విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదువుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ సురేశ్, సింగారపు బాబు, మునుకుంట్ల కోటేశ్వర్, ఎనబోతుల నర్సింగరావు, పాంద్రాల కరుణశ్రీ, కిషన్‌కుమార్, మంకాల యాదగిరి, చిలువేరు శ్రీనివాసులు, చెదులూరి పరిమళ, చంద్రశేఖర్ రాజు పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారుల పాదయాత్ర



సంగెం : ఎల్గూర్ రంగంపేట నుంచి కాలినడకన కొండగట్టుకు బయలుదేరిన హనుమాన్ మాలధారులు

సంగెం : మండలంలోని ఎల్గూర్ రంగంపేట, చింతలపల్లి గ్రామాలకు చెందిన హనుమాన్ మాలధారులు కొండగట్టుకు ఆదివారం పాదయాత్రగా బయల్దేరారు. ఎల్గూర్ రంగంపేటకు చెందిన మడ్డి చేరాలు, చింతలపల్లి నుంచి నాగరాజు, తదితరులు హనుమాన్ మాల వేసుకున్నారు. మండల రోజుల పాటు దీక్ష చేపట్టిన హనుమాన్ స్వాములు ఇరుముడి ధారణ చేసుకుని హనుమాన్ జయంతి నాటికి కొండగట్టులోని ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకోవడానికి కాలినడకన బయల్దేరి వెళ్లారు. వారికి గురుస్వామి పెద్దగోని రాజు, పాణి, ముజ్జిగ అనిల్, కడారి కనకరాజు, రమణయ్య, గోపి, నీలం జనార్దన్ తదితరులు వీడ్కోలు పలికారు.

భద్రాచలంకు..



నెక్కొండ : భద్రాచలానికి వెళ్తున్న మాలధారులు

నెక్కొండ : మండలంలోని దీక్షకుంటకు చెందిన హనుమాన్ స్వాములు మాల విరమణ కోసం భద్రాచలంకు చేపట్టిన పాదయాత్ర మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా గురు స్వాములు కోల ప్రవీణ్‌స్వామి, అక్కినపల్లి వెంకటస్వామి మాట్లాడారు. జూన్ 1న హనుమాన్ జయంతి నాటికి పాదయాత్ర భద్రాచలంకు చేరుకుంటుందని తెలిపారు. పాదయాత్రలో హనుమాన్ స్వాములు అక్కినపల్లి సిద్ధార్థ, కూస సాంబనర్సయ్య, శివాజీ, ప్రశాంత్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టితో నేలకు సారం

దుగ్గొండి : ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన చెరువుల పూడికతీత కార్యక్రమం రైతులకు వరంగా మారింది. ఒండ్రు మట్టిని తీయడంతో చెరువులు లోతుగా మారి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతోంది. నల్ల మట్టిని రైతులు పంట భూములకు తరలించడంతో నేలలు సారవంతం అవుతున్నాయి. ఉపాధి పథకంలో భాగంగా రైతులు ట్రాక్టర్లు సమకూర్చుకుంటే కూలీలు ఉచితంగా మట్టిని పోస్తున్నారు. ఇలా ఎకరా భూమికి 30 ట్రాక్టర్ల టిప్పులు తరలించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. సరాసరి ఒక్కో రైతు తమ పంట పొలాలకు 60 ట్రిప్పులు తరలించుకున్నారు. సేంద్రియ ఎరువుల లభ్యత తక్కువగా ఉండటంతో కొన్నేళ్లుగా నేలలు సారాన్ని కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో చెరువు మట్టి రైతులకు వరంగా మారిందని చెప్పవచ్చు. మండల పరిధిలో గత రెండు నెలలుగా జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో 1.53 లక్షల క్యూబిక్ మీటర్ల నల్ల మట్టిని మండలంలోని 60 చెరువుల్లో నుంచి తీశారు. సారవంతమయిన మట్టిని మండలవ్యాప్తంగా 6 వేల 400 మంది రైతులు 12 వేల ఎకరాల్లోని వారి పంట భూములకు తరలించుకున్నారు. దీంతో ఈసారి అధిక దిగుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయి.



నల్లమట్టితో నింపిన ఆయిల్‌పామ్ తోటలో రైతు నగేశ్

75 ట్రిప్పులు పోయించుకున్న...

నేను రెండున్నర ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోట సాగు చేశా. రెండేళ్లు అవుతోంది. మొక్కలు ఎదుగదల దశలో ఉన్నాయి. అంతర పంటగా మొక్కజొన్న, వేరుశనగ, మిరప, పత్తి లాంటివి సాగు చేస్తున్నా. భూసారం లేక పంట ఎదగడం లేదు. ఈ క్రమంలో ఉపాధి పథకంలో ఉచితంగా మట్టి పోస్తుండడంతో ట్రాక్టర్‌ను అద్దెకు తెచ్చుకుని మట్టి తరలించుకున్నాను. కూలీలు 75 ట్రిప్పులు ఉచితంగా పోశారు. నేల సారవంతంగా మారింది. కూలీల ఖర్చు లేదు. ట్రాక్టర్ అద్దె చెల్లించాను.

–గంజి నగేశ్, రైతు, అడవిరంగాపురం

యువకుడి ఇంటి ఎదుట యువతి ఆందోళన

● మద్దతు తెలిపిన మహిళా సంఘాలు

చెన్నారావుపేట : యువకుడి ఇంటి ఎదుట యువతి బైఠాయించి ఆందోళన చేపట్టిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రుచిత, మజ్జిగ అన్వేశ్ సుమారు 8 ఏళ్లపాటు ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన అన్వేశ్ కొద్ది నెలలుగా తప్పించుకు తిరుగుతున్నాడు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి తల్లి, సోదరితో కలిసి ఉంటున్న తనను మోసం చేసేందుకు యత్నిస్తున్నాడని రుచిత వాపోయింది. అన్వేశ్‌తోనే తనకు వివాహం జరిపించాలని కోరింది. మహిళా సంఘాలు రుచితకు మద్దతు తెలిపాయి. యువతికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని మహిళలు భరోసా ఇచ్చారు.



అన్వేశ్ ఇంటి ఎదుట బైఠాయించిన రుచిత

ప్రతాప్ మెమోరియల్ క్రికెట్ టోర్నీకి తీర్మానం

వరంగల్ స్పోర్ట్స్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు త్వరలో వరంగల్ క్రికెట్ సంఘం మాజీ అధ్యక్షుడు గుజ్జారి ప్రతాప్ స్మారక టోర్నమెంట్ నిర్వహించేందుకు అసోసియేషన్ జనరల్ బాడీ తీర్మానించింది. హనుమకొండలోని వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో జిల్లాలో జరిగిన అభివృద్ధిని సభ్యులకు జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ (మార్షల్) వివరించారు. లీగల్ అడ్వైజర్‌గా సత్యప్రకాష్, వరప్రసాద్ చార్టెడ్ అకౌంట్ తిప్పర్తి రాఘవరెడ్డి ప్రతిపాదించగా జిల్లాలోని 33మంది క్లబ్ కార్యదర్శులు ఆమోదించారు. అనంతరం సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు దివంగత అనిల్ మెమోరియల్ టోర్నమెంట్‌ను అండర్ –19 కేటగిరీతో పాటు, అండర్ –16 కేటగిరీలో నిర్వహించేందుకు క్లబ్ కార్యదర్శులు ఏకగ్రీవంగా తీర్మానించినట్లు కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. కమిటీ చైర్మన్‌గా కోదండపాణి, సభ్యులుగా మార్నేని ఉదయభానురావు, అరుణ్, శ్రీనివాస్‌రెడ్డి, స్వామిచరణ్‌ను నియమిస్తూ జనరల్ బాడీ ఆమోదించినట్లు వివరించారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఖాజా, రఘురాం, స్వామిచరణ్, సంయుక్త కార్యదర్శి ఉపేందర్, కోశాధికారి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్, అభినవ్ వినయ్, మట్టెడ కుమార్, రాము పాల్గొన్నారు.

నేటి నుంచి రాజరాజేశ్వరి దేవి ఆలయ వార్షికోత్సవం

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవి దేవాలయ 53వ వార్షికోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న వేడుకల్లో భాగంగా సోమవారం విఘ్నేశ్వరస్వామి వారికి 53 లీటర్ల చెరుకు రసంతో అభిషేకం, అర్చన, హోమం, 28న రాజరాజేశ్వరి దేవి జన్మదినోత్సవం సందర్భంగా 53 రకాల సుగంధ ద్రవ్యాలు, 135 లీటర్ల ఆవుపాలతో అమ్మవారికి విశేష అభిషేకం, తొమ్మిది రకాల పుష్పాలతో లక్షపుష్పార్చన, 29న సుబ్రహ్మణేశ్వర స్వామికి 53 లీటర్ల ఆవుపాలతో అభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వివరించారు. వేడుకలకు భక్తులు హాజరుకావాలని అర్చకుడు యెల్లంభట్ల లక్ష్మణశర్మ కోరారు.

ఉత్తమ ఏఈగా 'రవికుమార్'

ఆత్మకూరు : విద్యుత్‌శాఖ మండల ఏఈ రవికుమార్ హనుమకొండ జిల్లా ఉత్తమ ఏఈగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) మోహన్‌రావు చేతుల మీదుగా రవికుమార్ ఆదివారం అవార్డు అందుకున్నారు. ఈ క్రమంలో ఏఈ రవికుమార్‌ను ఆ శాఖ అధికారులు సామ్యా నాయక్, సాంబరెడ్డి, సుబ్రహ్మణ్యేశ్వర్, అనిల్, సిబ్బంది అభినందించారు.

వాటర్ ప్యూరిఫయర్ అందజేత

కొత్తగూడ : పదో తరగతి వరకు విద్యా బుద్ధులు నేర్పిన పాగుళ్లపల్లి ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తమవంతు సాయంగా వాటర్ ప్యూరిఫయర్‌ను ఆదివారం అందజేశారు. 2022–23 బ్యాచ్ పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అంతా కలసి అందించడం అభినందనీయమని ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు నాగలక్ష్మి, హెచ్ఎం విష్ణువర్ధన్‌రావు అన్నారు.